క్లుప్తంగా

పాఠశాలలో పిచ్చి మొక్కలు



మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉన్నాయి. పిచ్చి మొక్కల కారణంగా విష పురుగులు సంచరిస్తుండటంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారింది. ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించి పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చౌడేశ్వరమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకొంటున్న ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, భక్తులు

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారి పల్లె పంచాయతీలోని సీఎం కొత్తపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా జ్యోతులను వెలిగించిన సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, దేవపట్ల సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వి.వి.ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సహదేవ, కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మైక్ సెట్ వితరణ



ఆలయానికి మైక్‌సెట్‌ను అందజేస్తున్న కోలాట బృందం సభ్యులు

పుల్లంపేట : శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కోలాట బృందం వారు ఎగువరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయానికి రూ.14 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. బృందం సభ్యులను గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా సత్యమ్మ తిరునాల



అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న మహిళలు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి సత్యమ్మ వీధిలో వెలసి ఉన్న శ్రీ సత్యమ్మ దేవత తిరునాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి పోతురాజును గ్రామోత్సవం నిర్వహించామన్నారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి బలిదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ప్రతిమ ముగ్గు వేశారు. సోమవారం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కార్యనిర్వాహకులు కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ మహేష్‌నాయుడు

ఓబులవారిపల్లె : క్రీడలు యువతకు శారీరక, మానసిక దృఢత్వాన్ని కల్గిస్తాయని ఎస్ఐ పి.మహేష్ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదినేపల్లి గ్రామంలో ముదినేపల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను మహేష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి అల్లర్లు జరగకుండా పోటీలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ఆరంభించారు. పోటీలలో దాదాపు 20 జట్లు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

మదనపల్లె : తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఆదివారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వారు చేపట్టిన దీక్షలు 12వ రోజుకు చేరాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షలో ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఇప్పటికే అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, డిమాండ్ల పరిష్కారం అయ్యేదాక దీక్షలు కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి తాము నిర్వహిస్తున్న విధులను పూర్తిస్థాయిలో బహిష్కరించి ఆందోళన ఉధృతం చేస్తున్నట్లు నాయకులున తెలిపారు. దీక్షలో ఎస్.కే.రెడ్డెప్ప, నాగరాజు, కన్నయ్య, గోపాలకృష్ణలు పాల్గొన్నారు.

వానా కాలం.. వ్యాధులతో భద్రం

- పరిసరాల పరిశుభ్రతే ప్రధానం
- సీజనల్ రోగాలతో పొంచి ఉన్న ముప్పు
- జాగ్రత్తలు పాటిస్తే రోగాలు దూరం
- హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు



ప్రభుత్వ హైస్కూల్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

రాజంపేట టౌన్ : ఈ ఏడాది ముందస్తుగానే రుతుపవనాలు వచ్చాయి. అలాగే తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దాంతో ఆ నీటిలో దోమలు, సూక్ష్మక్రిములు వృద్ధి చెంది వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు.

ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా పిల్లలు, వృద్ధులు త్వరగా వ్యాధుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు తినే ఆహారం, తాగు నీరు విషయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు చెబుతున్నారు.

దోమల వ్యాప్తికి ఖాళీ స్థలాలే ఆవాసలు

జలుబు, జ్వరం, దగ్గు, అతిసారం, వాంతులు వంటి వాటితో పాటు మరిన్ని అంటువ్యాధులు వర్షా కాలంలోనే ఎక్కువగా వ్యాపిస్తాయి. దోమలు, ఈగల వల్లే ఈ వ్యాధులు వ్యాపిస్తాయి. మురికి కాలువలు, ఖాళీస్థలాలు దోమలు, ఈగలకు ఆవాసాలై వ్యాధులు వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇటు మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాల్లో అటు గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసినప్పుడు ఖాళీస్థలాల్లోను, రోడ్లపై నీళ్లు కొన్ని రోజుల పాటు నిల్వవుండటం వల్ల ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మున్సిపల్ అధికారులు, గ్రామ పంచాయితీ, సచివాలయ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలేందుకు ఇవే కారణాలు

సీజనల్ వ్యాధులకు అనేక కారణాలున్నాయి. దోమ కుట్టినప్పుడు వాటి లాలాజలంలో ఉన్న సూక్ష్మజీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించి జబ్బులు కలుగచేస్తాయి. దోమల వల్ల ప్రధానంగా డెంగీ, చికున్ గున్యా, మలేరియా, మెదడువాపు, ఫైలేరియా (బోదకాలు) వంటి జబ్బులు సంక్రమిస్తాయి. అలాగే తాగునీరు, ఆహారం కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, విరేచనాలు, కామెర్ల బారిన పడతారు. నీటితో పాటు ఆహారం కలుషితమైతే ప్రధానమైన జబ్బు అతిసార (నీళ్ల విరేచనాలు) సోకే ప్రమాదముంది. కొన్నిమార్లు వాంతులు కూడా ఎక్కువగా అవుతాయి. ఇందువల్ల శరీరంలో నీటిశాతం తగ్గిపోయి మనిషి నీరసించిపోతాడు. సరైన సమయంలో స్పందించి వైద్యం చేయించుకోకుంటే ప్రాణాపాయం కూడా ఉంటుంది. విరేచనాలకు గురైన వారు వెంటనే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాగాలి. అలాగే మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకుంటే మంచిది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- వేడిగా ఉన్న ఆహారాన్నే తినాలి
- వీలైనంత వరకు రోడ్డు పక్కన తినుబండారాలు తినకపోవడమే మంచిది
- ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి
- ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి
- నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దోమల వల్ల పలురకాల వ్యాధులు ప్రబలుతాయి. అందువల్ల ప్రజలు వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ నిర్ధారణ అయితే చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాము. అన్ని పంచాయితీల్లోని పంచాయితీ, గ్రామ సచివాలయాల సెక్రటరీలకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ఆదేశాలిచ్చాము. ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేయాలని క్లాప్‌మిత్రలకు సూచించాము. పారిశుద్ధ్యంపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడతాము.

– పగడాల వరప్రసాద్, ఎంపీడీఓ, రాజంపేట

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



లిఖిత సాయి



హేమసాయిరెడ్డి



కారేటి యశ్వంత్

చిట్వేలి : ఎన్ఎంఎంఎస్‌కు చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు ఆదివారం తెలియజేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మాచిరాజు లిఖిత సాయి, కొణిరెడ్డి హేమసాయిరెడ్డి, కారేటి యశ్వంత్‌లు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలపాటు మొత్తం రూ.48 వేలు అందిస్తుందని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు.

రైతులందరూ ఇ-కేవైసీ చేయించుకోవాలి

సుండుపల్లె : అన్నదాత సుఖీభవ పథకానికి రైతులందరూ ఇ-కేవైసీ ప్రక్రియను చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. గత ప్రభుత్వంలో రైతు భరోసాగా పిలవబడిన దీనిని అన్నదాత సుఖీభవ పేరు మార్చారన్నారు. మండలంలోని రైతులందరూ తమ సచివాలయాల పరిధిలో ఇ-కేవైసీ ప్రక్రియను చేయించుకోవాలని చెప్పారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన తెలియజేశారు.

ప్రజా నాయకుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి

- ఘనంగా మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుక
- పెద్దసంఖ్యలో హాజరైన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- చురుగ్గా సేవా కార్యక్రమాలు నిర్వహణ



రాయచోటి: పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాయచోటి: రక్తదానంలో పాల్గొన్న యువత

రాయచోటి : వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాయచోటిలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ హరూన్‌బాషా, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, పట్టణ మాజీ అధ్యక్షులు రియాజుర్ రెహమాన్, స్థానిక కౌన్సిలర్లు, నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో శ్రీ వినాయకుడికి అర్చన, అఘోర లింగేశ్వరునికి అభిషేక అర్చనలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజుయాదవ్, నియోజకవర్గ మేధావుల సంఘం అధ్యక్షులు జానం రవీంద్రయాదవ్, జిల్లా టూరిజం కౌన్సిలర్ మెంబర్ కొత్తిమీర ప్రసాద్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు చంద్రానాయక్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నగేష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, నవాజ్‌బాషా, సురేష్, జగదీష్, హరివాహన నాయకుడు నాగేంద్ర, గువ్వల జగదీష్, పలువురు వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం

పట్టణ అధ్యక్షులు నవాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేశారు.

అన్నదానం

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పేద ప్రజలకు, శివారు ప్రాంతాలలో నివాసం ఉంటున్న పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయ ఆవరణంలో బీసీ నేత విజయభాస్కర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

నియోజకవర్గ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి సేవలు మరువలేనివి

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి సేవలు మరువలేనివని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలకు సుదర్శన్ రెడ్డి, రెడ్డయ్యలు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకట నారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, రమణయ్య, జనార్దన్ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శంకర్ నాయుడు, జగన్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాజు, కొండా ప్రసాద్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రాజబాబు, రాయచోటి వైఎస్సార్ సిపి యువ నాయకులు పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాష, జాకీర్, ఫరూక్, బాబ్జాన్, నబీ, మహమ్మద్ వలీ, గౌస్ పీర్, నవాజ్, వైఎస్సార్ సిపి నాయకులు దప్పేపల్లి సిద్దారెడ్డి, రంగారెడ్డి, జై చంద్రారెడ్డి, అంబాబత్తిన రమేష్, లాలూ యాదవ్, సెల్వరాజ్, బాలకృష్ణారెడ్డి, మల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : ప్రజానాయకుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించాయి. మండల కేంద్రంలోని ఎస్‌కే ఫంక్షన్ హాలులో ఆదివారం కేక్ కట్ చేసి గడికోట శ్రీకాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్‌రెడ్డి పేరంపల్లిలోని ఆవుల వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు.



లక్కిరెడ్డిపల్లె: ఆహారం వడ్డిస్తున్న నాయకులు

రామాపురంలో..

రామాపురం (రాయచోటి) : మండల కేంద్రంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో భారీ జనసంద్రం మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు గడికోట ప్రభాకర్‌రెడ్డి, గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని శ్రీకాంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



గాలివీడు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



రామాపురం(రాయచోటి): కేక్ కటింగ్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, నాయకులు



రాయచోటి: వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలి



మణిదీప్‌కు పురస్కారం అందజేస్తున్న చిక్కాల బాలాజీరావు తదితరులు

నందలూరు : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి పట్టుదలతో బాగా చదివి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ రంగస్థల నటులు, నంది అవార్డు గ్రహీత, కళా బంధు చిక్కాల బాలాజీరావు (ఆల్విన్ బాలాజీ) కోరారు. నేటి విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని అన్నారు. ఆయన సతీమణి స్వర్గీయ చిక్కాల జయలక్ష్మి స్మృత్యర్థం ఏర్పాటు చేసిన చిక్కాల జయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతిభా పురస్కారాలను ఆదివారం ఉదయం స్థానిక గ్రంథాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కన్వీనర్ అల్లం అశోక్‌కుమార్ మాట్లాడుతూ కలలను కనడం గొప్ప కాదని, ఆ కలలను సాకారం చేసుకోవడానికి పట్టుదల, ఓర్పుతో కృషి చేసిన వారే విజయాన్ని సొంతం చేసుకుంటారని అన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షులు షఫీవుల్లా, జిల్లా నాయకుల చలపాటి నరసింహారావులు మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, చెడు స్నేహితులకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మణిదీప్ (పదవ తరగతి), ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సాయికీర్తన్ (ఎంపీసీ)లకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రతిభా నగదు పురస్కారాలను చిక్కాల బాలాజీరావు చేతుల మీదుగా అందజేశారు.

గెవిమాతమ్మా.. చల్లంగా చూడమ్మా



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



అలంకరణలో గెవిమాతమ్మ

సంబేపల్లె : గెవిమాతమ్మ చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ గెవిమాతమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. గ్రామ దేవత జాతరను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల విద్యుత్ అలంకరణలతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మొక్కులు తీరిన భక్తులు చాందినీబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నూకాలమ్మకు మొక్కులు చెల్లించుకున్న ఆకేపాటి



సుండుపల్లె: నాయకులతో కలసి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



పుల్లంపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న ఆకేపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుల్లంపేట : మండల కేంద్రం పరిధి రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ నూకాలమ్మ జాతరను వైభవంగా జరుగుతోంది. 70 సంవత్సరాలు తరువాత గ్రామంలో కలసికట్టుగా ప్రజలు ఈ జాతరను నిర్వహించుకోగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం రాజంపేట శాసనసభ్యులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, అడ్వకేట్ నాయక్‌లు ఆకేపాటిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాపినేని విశ్వనాథ రెడ్డి, రమేష్ నాయుడు, రామనాథం, నరసింహారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, దాసరి పెంచలయ్య, నాయకులు శ్రీను నాయుడు, రఘు, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతర విందులో..

సుండుపల్లె : వైఎస్ఆర్‌సీపీ మండల మహిళా మండలి అధ్యక్షురాలు రెడ్డమ్మ పిలుపు మేరకు నీలంవాండ్లపల్లె సమీపంలోని నాగారపమ్మ జాతర విందులో వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన వైఎస్ఆర్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరంరెడ్డి, రెహమాన్‌ఖాన్, సర్పంచులు ఆకుల శ్రీనివాసులు, రామాజయచంద్ర, ఎంపీటీసీ బాబురెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్ర కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు

చిన్నమండెం : క్లాప్‌మిత్రలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చిన్నమండెంలో మండల అధ్యక్షుడు రెడ్డయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా శ్రమ చేసే కార్మికులకు మాత్రం తగిన వేతనాలు పెరగడం లేదన్నారు. సాక్షాత్తూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని చెప్పినప్పటికీ పాలక ప్రభుత్వాలు మాత్రం ఆ వైపున ఆలోచన చేయడం లేదన్నారు. ఇప్పటికే దాదాపు 8 మాసాలు గడుస్తున్నా కార్మికులకు రావాల్సిన జీతాలు చేతికి రాక అష్టకష్టాలు పడుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించడమే కాక పని భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేష్, కార్యకర్తలు రెడ్డప్ప, చిన్నరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి

కడప ఎడ్యుకేషన్ : శ్రీశ్రీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని పాలకొండయ్య ట్రస్టు అధ్యక్షుడు కొండ సుబ్బయ్య అన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో కడపలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు సామాన్య జీవితాన్ని ప్రారంభించి తన తెలుగు సాహిత్య గేయ రచయితలతో అభిమానుల చే శ్రీశ్రీగా బిరుదు అందుకున్న మహాకవి అన్నారు. సినీరంగంలో ఎన్నో ఉత్తమ గీతాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రాయల్ కరీముల్లా, నాగయ్య పాల్గొన్నారు.

పని గంటలపై 20న నిరసన

బి.కొత్తకోట : కార్మికుల పనిగంటలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈనెల 20న నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం బి.కొత్తకోటలో అనుబంధ సంఘాల సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా మాట్లాడుతూ ఎనిమిది గంటలున్న కార్మికుల పనిదినాలను పెంచడం దారుణమన్నారు. కార్మిక సంక్షేమాన్ని, హామీల అమలును విస్మరించిన ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

నియామకం

మదనపల్లె రూరల్ : రాయచోటి టీడీపీ పరిశీలకుడిగా మదనపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పఠాన్ ఖాదర్‌ఖాన్ నియమితులయ్యారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పఠాన్ ఖాదర్‌ఖాన్ మాట్లాడుతూ...గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించారు

కడప రూరల్ : ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి డబ్బు తీసుకొని, మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటిపాటి సుబ్బమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024 డిసెంబర్ 20న ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయానికి వెళ్లినప్పుడు పరిచయమైన వ్యక్తి ఉద్యోగాలను ఇప్పిస్తానని చెప్పారన్నారు. తితిదేలో ముగ్గురికి ఉద్యోగాలు ఇప్పించడంతో నమ్మకం కలిగిందని, ఆ ఉద్యోగానికి ఒక్కొక్కరూ రూ. 2.50 లక్షలు ఇచ్చారన్నారు. తర్వాత ఆయుష్మాన్ భారత్ కింద ఉద్యోగాలున్నాయంటూ మరొకరిని పరిచయం చేశారని తెలిపారు. దీంతో తనకు తెలిసిన పలువురి వద్ద నుంచి కోటి రూపాయలకు పైగా డబ్బు ఇప్పించానన్నారు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయామని గ్రహించి ఏప్రిల్ 15న డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు కేసును ఒంటిమిట్ట స్టేషన్‌కు రెఫర్ చేసినా ఇప్పటి వరకూ తమకు న్యాయం జరగలేదని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.